E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

23-04-2025 గురువారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com




తెలంగాణలో దారెత్తిస్తున్న ఎండలు 4లో



# ఉగ్రవాదుల పాశవిక చర్య.. 27 మంది పర్యటకులు మృతి

- బైసరన్‌లో పర్యాటకులే లక్ష్యం - ఉగ్రవాదుల పాశవిక దాడి
- ఘటనలో 27 మంది మృతి, 20 మందికి పైగా పరిస్థితి విషమం
- భద్రతా బలగాల హుటాహుటిన చర్యలు – హెలికాప్టర్ల ద్వారా గాయపడినవారి తరలింపు
- అమర్‌నాథ్ యాత్రకు ముందు ఈ దాడి – భద్రతాపరంగా ఆందోళన కలిగించే పరిణామం
- పహల్గాం ప్రాంతంలో భయాందోళన – పర్యాటకులు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొనే పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని ముష్కరులు లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది

2లో



## రేవంత్ అంటే ఎంత ఇష్టమో.. జపాన్‌లో సర్‌ప్రైజ్ గిఫ్ట్.. సీఎం ఫిదా..

2లో



**ఈ కబురు :** సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ టూర్ గ్రాండ్ సక్సెస్. సుమారు లక్ష కోట్ల మేర తెలంగాణకు పెట్టుబడుల వేట కొనసాగింది. లాస్ట్ డే.. హిరోషిమాలో పర్యటించారు. అమెరికా చేసిన అణుబాంబు గాయం నుంచి ఆ నగరం రొమ్ము విరిచి నిలబడిన తీరును చూసి ఆశ్చర్యపోయారు. అక్కడే మరో ఆసక్తికర సంఘటన కూడా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మరుపు రాని జ్ఞాపకాన్ని ఇచ్చింది.

**రేవంత్ పొలిటికల్ స్టార్**

రేవంత్ అంటే మాస్ లీడర్. రాజకీయాల్లో సూపర్ స్టార్. సినిమా హీరోలకే ఫ్యాన్స్ ఉంటారా? మాకుండరా? నేను పొలిటికల్ హీరోను.. నాకూ ఫ్యాన్స్ ఉంటారంటూ గతంలో ఓ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో రేవంత్‌రెడ్డినే స్వయంగా చెప్పారు. ఆయన చెప్పింది అక్షరాలా నిజం అని చాటిచెప్పేలా.. జపాన్, హిరోషిమా నగరంలో ఓ ఇంట్రెస్టింగ్ ఇన్సిడెంట్ జరిగింది. అదేంటంటే...

**జపాన్‌లో రేవంత్ ఫ్యాన్స్**

గుండెల్లో అభిమానం ఉండాలే గానీ.. అది ఏ రూపంలోనైనా బయటకు వచ్చేస్తుంది. అదే జరిగింది. ఇద్దరు స్కూల్ స్టూడెంట్స్. ఒకరు 7th క్లాస్ చదివే హరిణి, ఇంకొకరు 8th క్లాస్ చదువుతున్న హాసిని. అక్కాచెల్లెలు. హిరోషిమాలో ఉంటారు. పేరెంట్స్ అక్కడే సెటిల్ అయ్యారు. వాళ్లకు రేవంత్ అంటే



## హిరోషిమాలో సీఎం రేవంత్ రెడ్డి: తెలంగాణ జపాన్ భాగస్వామ్యానికి కొత్త దిక్సూచి

- హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్‌కు ప్రాధాన్యం
- టెక్నాలజీ, పునరుత్పాదక విద్యుత్తు రంగాల్లో సంయుక్త ప్రయత్నాల ప్రతిపాదనస్మార్ట
- సిటీలు, భూగర్భ మెట్రో, విపత్తుల నివారణలో హిరోషిమా అనుభవాలను తెలంగాణకు
- సంస్కృతి, బౌద్ధ వారసత్వ పరిరక్షణకు రెండు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతం
- హిరోషిమాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కలిసి పనిచేద్దామని సీఎం పిలుపు

2లో

## 'మీరు అందించిన సాయం చూస్తుంటే గుండె బరువెక్కుతోంది'




**ఈ కబురు:** బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం లగచర్ల మహిళలు విరాళం ప్రకటించారు. మంగళవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి రూ.లక్ష అందించారు. విరాళం చూసి గుండెనిండా సంతోషంగా అనిపించిందని కేటీఆర్ ఎమోషనల్ అయ్యారు. కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉన్న బీఆర్ఎస్‌కు.. ఉడతాభక్తిగా లగచర్ల గిరిజన మహిళలు సహాయం చేశారని అన్నారు. లగచర్ల గిరిజనులను పోలీసుల చేత ప్రభుత్వం ఎంతో హింసించిందని అన్నారు. ఆ ఘటనను ఎవరు మర్చిపోయినా.. బీఆర్ఎస్ మర్చిపోదని.. అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మరోవైపు, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు సర్వం సిద్ధం చేస్తోంది. సభ నిర్వహణకు మరో ఐదు రోజుల సమయం తరువాయి 2లో

## పాఠాలు బోధించేందుకు కాదు.. స్నేహితుడిలా వచ్చాం: జేడీవాన్స్

2లో



**ఈ కబురు:** భారత్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించిన తరుణంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఆయన వాణిజ్య ఒప్పందం దిశగా ప్రధాని మోదీతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే

"వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేశాయి. ట్రంప్‌మోదీ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఇది కీలక అడుగని నేను భావిస్తున్నాను. మన దేశాల మధ్య ఒప్పందానికి ఇది రోడ్‌మ్యాప్‌గా మారనుంది" అని వాన్స్ అన్నారు. రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన బంధాన్ని బలోపేతం చేసుకోవడానికే మేం ఇక్కడకు వచ్చాం. మీరు ఇలాగే చేయాలని అని పాఠాలు చెప్పడానికి మేం రాలేదు. గతంలో అలా జరిగింది. తక్కువ వేతనాలకు కార్మికులను అందించే దేశంగా భారత్‌ను గత ప్రభుత్వాలు చూశాయి. విమర్శలు చేశాయి. మన రెండు దేశాలు శ్రామిక శక్తిని గౌరవించే భాగస్వాములు. ప్రజాస్వామ్య ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వం ఇదే. మోదీకున్న



## మోదీ విమానం రాగానే.. ఫైటర్ జెట్స్‌తో సౌదీ అరుదైన స్వాగతం

**భారత ప్రధాని నరేంద్రమోదీకి సౌదీ అరేబియా యుద్ధ విమానాలతో ప్రత్యేక స్వాగతం పలికింది.**

**ఈ కబురు:** ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అరుదైన సందర్భం చోటు చేసుకుంది. ఎన్నడూ లేనివిధంగా ఆ దేశం మోదీని ప్రత్యేకంగా స్వాగతించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే.. రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్15 విమానాలు దానిని అనుసరించి, సగౌరవంగా స్వాగతించాయి. దీనికి సంబంధించిన వీడియోను విదేశాంగశాఖ షేర్ చేసింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు పడతాయని ఈ ఆత్మీయ స్వాగతం చాటుతోంది.

ప్రధాని రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు సౌదీ వెళ్లారు. ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత తరువాయి 2లో

దూసుకెళ్తున్న బంగారం ధర.. లక్ష దాటేసి ఇంకా పైపైకి! 4లో

జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం 5లో

తెలంగాణలో ఇంటర్ ఫలితాలు.. బాలికలదే పైచేయి



3లో

సివిల్స్ ఫలితాల్లో మహిళా 'శక్తి'.. టాప్ 5 ర్యాంకర్ల గురించి తెలుసా?



2లో

యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్.. టాప్ 10 ర్యాంకర్లు వీరే..



3లో

పార్లమెంటే సుప్రీం: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



2లో

## 'మీరు అందించిన సాయం చూస్తుంటే గుండె బరువెక్కుతోంది'

మొదటి పేజి తరువాయి

మాత్రమే ఉండడంతో ఏర్పాట్లలో ఆ పార్టీ అధినాయకత్వం బిజీబిజీగా ఉంది. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ కావడంతో ఇటు పార్టీ శ్రేణులతో పాటు అటు ప్రజానీకంలోనూ ఆసక్తి నెలకొంది.

ఈ సభను బీఆర్ఎస్ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. స్వయంగా పార్టీ అధినేత కేసీఆరే సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండటం గమనార్హం. సభా స్థలి ఎంపిక, వాహనాల కూర్పు, జన సమీకరణ విధానం ఇలా అన్నింటిపై కేసీఆర్ ఆలోచనలు ఇమిడి ఉన్నట్లుగా పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సభకు లక్షలాదిగా జనాలను తరలించాలనే లక్ష్యంతో ఆ పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది.

## మోదీ విమానం రాగానే.. ఫైటర్ జెట్స్‌తో సౌదీ అరుదైన స్వాగతం

మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌ల నడుమ ఇటీవల జరిగిన చర్చల తర్వాత ఇరుపక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది.

సౌదీలో ల్యాండ్ అయిన వెంటనే మోదీ పోస్టు.. సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ జెడ్డాలో ల్యాండ్ అయ్యారు. దీనిపై ప్రధాని ఎక్స్ వేదికగా స్పందించారు. "ఈ పర్యటన రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఈ రోజు, రేపు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇది మూడోసారి.



## పాఠాలు బోధించేందుకు కాదు.. స్నేహితుడిలా వచ్చాం: జేడీవాన్స్

మొదటి పేజి తరువాయి

ప్రజామోద రేటింగ్‌లు నాకు అసూయ కలిగించేలా ఉన్నాయి. ఇదే విషయాన్ని మోదీ వద్ద ప్రస్తావించాను.

అమెరికాతో పాటు భారత్ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారు. మన రెండు దేశాల భాగస్వామ్యం వృద్ధి చెందాలన్నదే ట్రంప్ ఆకాంక్ష. ఇక భారత శిల్పాకళా నైపుణ్యం నన్ను అబ్బురపరిచింది. భారత్.. చరిత్ర, సంప్రదాయాలతో సుసంపన్నమైంది. భవిష్యత్తు పట్ల భారత్ దార్శనికత మెచ్చుకోదగినది. అభివృద్ధి చెందేందుకు భారత్‌లో ఎన్నో అవకాశాలున్నాయి. అలాగే ఏదో సాధించాలనే తపన భారతీయుల్లో అధికం" అని వాన్స్ కొనియాడారు.

కాగా.. అమెరికాకు వివిధ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పన్నుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఆ తర్వాత ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు తగిన సమయం లభిస్తుందని అప్పట్లో అభిప్రాయం వ్యక్తమైంది. అనుకున్నట్టుగానే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.

## పార్లమెంటే సుప్రీం: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

**ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.**



**ఈ కబురు:** రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదంటూ ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్' అని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

'ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటే సుప్రీం' అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడా ధన్‌ఖడ్ ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు.

రాష్ట్ర గవర్నర్ పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని సుప్రీంకోర్టు గడువు నిర్ణయిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదు. ప్రజాస్వామ్యశక్తులపై అణుక్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదు. ఇప్పుడు.. శాసనాలు చేయగలిగే జడ్జీలు మనకు ఉన్నారు! కార్యనిర్వాహక విధులూ వారే నిర్వర్తించేస్తారు. సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు. వారికి మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. ఎందుకంటే దేశ చట్టాలు వారికి వర్తించవు" అని అన్నారు. ఇదే అంశంపై భాజపా ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. "ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే గనుక.. పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి" అని ఎంపీ వ్యాఖ్యానించారు. అయితే భాజపా నేతల వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. **

# ఉగ్రవాదుల పాశవిక చర్య.. 27 మంది పర్యటకులు మృతి

**ఈ కబురు:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.



మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది.

బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు.

అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్‌నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

## హిరోషిమాలో సీఎం రేవంత్ రెడ్డి: తెలంగాణ-జపాన్ భాగస్వామ్యానికి కొత్త దిక్సూచి



**ఈ కబురు:** సీఎం రేవంత్ రెడ్డి జపాన్ లో బిజీ బిజీగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సీఎంతో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం జపాన్ లోని హిరోషిమా ప్రి ఫెక్చర్ ను సందర్శించింది. ఈ సందర్భంగా హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులు సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి సీఎం రేవంత్ రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపాం అని అన్నారు.

వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్ లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా‌తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను వారు ప్రస్తావించారు.

వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.



## రేవంత్ అంటే ఎంత ఇష్టమో.. జపాన్‌లో సర్‌ప్రైజ్ గిఫ్ట్.. సీఎం ఫిదా..

మొదటి పేజి తరువాయి

ఎంతో అభిమానం. తెలంగాణ ముఖ్యమంత్రి తమ నగరానికి వస్తున్నారని తెలిసి.. ఆయన కోసం స్వయంగా ప్లకార్డ్స్ తయారు చేశారు ఆ చిన్నారులు.

**హిరోషిమాలో రేవంత్‌కు సర్‌ప్రైజ్**

'మా ప్రియతమ తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులకు హిరోషిమా నగరానికి స్వాగతం' అంటూ స్లోగన్ రాశారు. రేవంత్‌రెడ్డి ముఖచిత్రంతో పాటు చార్మినార్ ఫోటోను స్కెచ్ వేశారు. ఆ ఇద్దరు అమ్మాయిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి.. తాము వేసిన స్కెచెస్‌ను ఆయనకు అందించారు. జపాన్, హిరోషిమా నగరంలో ఉండే ఆ పిల్లలు తన మీద చూపించిన అభిమానానికి ఫిదా అయ్యారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. స్కెచెస్ చూసి మెచ్చుకున్నారు. వాళ్లతో కాసేపు ముచ్చటించారు. వాళ్ల స్టడీస్, ఫ్యామిలీ డీటైల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు.

**జపాన్‌లో జయ జయహే తెలంగాణ..**

అంతేకాదు. హిరోషిమాలోని గాంధీ మెమోరియల్ ముందు నిలుచుని.. తెలంగాణ జాతీయ గీతం "జయ జయహే తెలంగాణ"ను గానం చేశారు హరిణి అండ్ హాసిని. జపాన్‌లో ఉంటూ.. స్వచ్ఛమైన తెలుగులో.. తెలంగాణ గీతాన్ని.. గొంతెత్తి పాడి.. శెభాష్ అనిపించారు.

# సివిల్స్ ఫలితాల్లో మహిళా 'శక్తి'.. టాప్ -5 ర్యాంకర్ల గురించి తెలుసా?

**యూపీఎస్సీ సివిల్స్ 2024 ఫలితాల్లో అమ్మాయిలు అదరగొట్టారు. టాప్ 5 ర్యాంకుల్లో ముగ్గురు, టాప్ 25 ర్యాంకుల్లో ఏకంగా 11 మంది మహిళా అభ్యర్థులే ఉండటం విశేషం.**

**ఈ కబురు:** యూపీఎస్సీ సివిల్స్ 2024 ఫలితాల్లో అమ్మాయిలు అదరగొట్టారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సహా టాప్ 5 ర్యాంకుల్లో ముగ్గురు, టాప్ 25 ర్యాంకర్లలో 11 మంది మహిళా అభ్యర్థులే ఉండటం విశేషం. ఈ ఫలితాల్లో శక్తి దూబే టాప్ 1 ర్యాంకుతో సత్తా చాటగా.. హర్షిత గోయల్ 2, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకులతో అదరహో అనిపించారు. ఈ నేపథ్యంలో సివిల్స్ ఫలితాల్లో టాప్ 5 ర్యాంకుల్లో మెరిసిన అభ్యర్థులు విద్యార్హతలు, సివిల్స్‌లో వారు ఆప్షనల్స్‌గా ఎంచుకున్న సబ్జెక్టులేంటో పరిశీలిస్తే..

సివిల్స్‌లో తొలి ర్యాంకుతో సత్తా చాటిన శక్తి దూబే అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయో కెమిస్ట్రీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆమె పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని సత్తా చాటారు. శక్తి దూబే యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు చెందినవారు. యూనివర్సిటీ ఆఫ్ అలహాబాద్ నుంచి బ్యాచిలర్స్ పూర్తి చేశారు. అనంతరం బయో కెమిస్ట్రీలో పీజీ చేసేందుకు బెనారస్ హిందూ యూనివర్సిటీకి వెళ్లారు. 2018 నుంచి సివిల్స్‌కు సన్నద్ధమై జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకుతో అదరగొట్టారు.



హర్షిత గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకామ్ గ్రాడ్యుయేట్. ఆమె కూడా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌ను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని సివిల్స్‌లో రెండో ర్యాంకుతో మెరిశారు.

డోంగ్రే అర్చిత్ పరాగ్ వెల్లూరులోని విట్ నుంచి ఇంజినీరింగ్ చేశారు. ఫిలాసఫీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని అతడు మూడో ర్యాంకుతో సత్తా చాటారు.



షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో బీఈ పూర్తి చేశారు. సివిల్స్‌లో సోషియాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొన్న ఆమె.. నాలుగో ర్యాంకుతో భళా అనిపించారు.

ఆకాశ్ గార్గ్ దిల్లీలోని గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. సోషియాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని ఐదో ర్యాంకుతో మెరిశారు.

గతేడాది జూన్ 16న జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు దేశ వ్యాప్తంగా 9,92,599 మంది దరఖాస్తు చేసుకోగా.. 5,83,213మంది మాత్రమే పరీక్ష రాశారు. వీరిలో సెప్టెంబర్‌లో జరిగిన మెయిన్స్ రాత పరీక్షకు 14,627మంది క్వాలిఫై కాగా.. పర్సనాలిటీ టెస్ట్‌కు 2,845మంది ఎంపికయ్యారు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో 1,009 మంది అభ్యర్థులు (725మంది పురుషులు, 284మంది మహిళలు)ను వివిధ సర్వీసుల్లో నియమకాలకు యూపీఎస్సీ సిఫారసు చేసింది.

సివిల్స్‌లో సత్తా చాటిన టాప్ 25 ర్యాంకర్లలో 14మంది పురుషులు కాగా.. 11మంది మహిళలు. వీరంతా దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, వీఐటీ, జేఎన్‌యూ, దిల్లీ విశ్వవిద్యాలయం, అలహాబాద్ విశ్వ విద్యాలయాల నుంచి ఇంజినీరింగ్, హ్యుమానిటీస్, సైన్స్, కామర్స్, మెడికల్ సైన్స్, ఆర్కిటెక్చర్ వంటి కోర్సుల్లో గ్రాడ్యుయేషన్ చేసినవారు కావడం విశేషం. అలాగే, మెయిన్స్ రాత పరీక్షల్లో విజయం సాధించిన టాప్ 25మంది అభ్యర్థులు ఆంత్రోపాలజీ, కామర్స్ అండ్ అకౌంటెన్సీ, జాగ్రఫీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తమిళ భాషా సాహిత్యంతో సహా పలు సబ్జెక్టులను ఆప్షన్స్‌గా ఎంచుకున్నారు.

# బోటానికల్ గార్డెన్‌లో
# ప్రపంచ ధరిత్రీ దినోత్సవ వేడుకలు



ప్లాస్టిక్ వ్యర్థాలతో చేసిన వస్తువులను పరిశీలిస్తున్న సందర్శకులు




కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**మన భూమిని కాలుష్యరహితంగా మార్చుకునే బాధ్యత మనది : ఐఎఫ్ఎస్ రంజిత్ నాయక్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్ బొటానికల్ గార్డెన్ లో మంగళవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి 8 గంటల వరకు బర్డ్ వాక్ నిర్వహించగా, పచ్చని చెట్ల మధ్య రకరకాల పక్షులను చూసి సందర్శకులు ఆనందించారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ప్లాస్టిక్ వ్యర్థలతో చేసిన అనేక ఆవిష్కరణలపై బోటానికల్ గార్డెన్ వాకర్స్ కు, బర్డ్ వాక్ లో పాల్గొన్న వివరించారు. ఈ సందర్భంగా స్విచ్ ఎకో సంస్థకు చెందిన అక్షయ్ దేశ్ పాండే, టీజీఎఫ్‌డీసీ బృందం కలిసి సందర్శకులను తమ ప్రసంగంతో చైతన్యపరిచారు. ప్లాస్టిక్ బాటిళ్లను టీ షర్టులుగా, సిగరెట్ బట్లను కాగితంగా, నీటిలో పెరిగే కమ్మటి గడ్డిని చీరలుగా మారుస్తూ చూపించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్. రంజిత్ నాయక్ మాట్లాడుతూ ధరిత్రీ దినోత్సవాన్ని సంవత్సరంలో ఒక రోజు జరుపుకోవడం కాకుండా, ప్రతి రోజును మనం భూమిని కాపాడే రోజుగా పరిగణించాలన్నారు. మన భూమిని కాలుష్యరహితంగా మార్చి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ధరిత్రిని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ వి.తనూజ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మా రెడ్డి, ప్రాజెక్ట్స్ మానేజర్ కె.సుమన్, హెడ్ నేచురలిస్ట్ అఖిల్, నేచురలిస్ట్ అపరంజని, అక్షయ్ దేశ్ పాండే, ఆశితోష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



రకరకాల పక్షులను చూస్తూ సందర్శకుల బర్డ్ వాక్

# గోపన్ పల్లిలో ఘనంగా కట్ట మైసమ్మ వార్షికోత్సవం



కట్ట మైసమ్మ అమ్మవారి ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

**గ్రామ దేవతలను పూజించుకోవడం తెలంగాణ సంస్కృతిలో భాగం : కార్పోరేటర్ గంగాధర్ రెడ్డి**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : W**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ లో గల కోమటి కుంట కట్ట మైసమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్ రెడ్డిని ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో.. ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమని అన్నారు. అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ లో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ గర్,తాజ్ నగర్,సోఫా కాలనీ సొసైటీ అధ్యక్షులు విఠల్, సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి, కృష్ణ, మహేష్, సుమన్, శ్రీకాంత్, రామ్ రెడ్డి , నవీన్, ధనుంజయ్, స్థానిక కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన సీఎం రేవంత్ జపాన్ పర్యటన..



**వారం రోజుల్లో సాధించింది ఇదే..**
**ముగిసిన సీఎం రేవంత్ జపాన్ పర్యటన..**
**వారం రోజుల్లో సాధించింది ఇదే..**

**ఈ కబురు:** గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ లో బిజి బిజీగా పర్యటించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనను నేటితో విజయవంతంగా ముగించింది. ఈ పర్యటన ద్వారా తెలంగాణకు భారీ స్థాయిలో పెట్టుబడులు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. ఇప్పటివరకు సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో మొత్తం రూ.12,062 కోట్ల విలువైన పెట్టుబడులు, దాదాపు 30వేలకు పైగా ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ వారం రోజులు సీఎం రేవంత్ బృందం ఏ సాధించిందో చూద్దాం.

**ముఖ్యమైన ఒప్పందాలు..**
తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలక పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మరుబెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు మరుబెనీ ఓకే చెప్పింది. మరుబెనీ కంపెనీ మొదట రూ.1000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో దశల వారీగా ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. దీని ద్వారా 5 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనా ఉంది. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటయ్యే ఈ పార్క్ తో తెలంగాణలో సుమారు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించే ఛాన్సెస్ ఉన్నాయి. మరుబెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

**రూ.10,500 కోట్లతో కీలక ఒప్పందం..**
హైదరాబాద్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఎన్‌టీటీ డేటా, నెయిసాతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా దాదాపు రూ.10,500 కోట్లతో కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. అలాగే రేవంత్ సర్కార్ మరో కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. రుద్రారంలో విద్యుత్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు తోషిబా ట్రాన్స్ మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా కంపెనీ రూ.562 కోట్ల రూపాయలతో ప్రాజెక్టును చేపట్టనుంది.

**500 మందికి ఉద్యోగ అవకాశాలు..**
జపాన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో కంపెనీతో ఉద్యోగ నియామకాలకు సంబంధించి కీలక ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు టామ్‌కామ్, టెర్న్, రాజ్ గ్రూప్ సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది.

జపాన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి బృందం రేపు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానుంది. హైదరాబాద్ కు వచ్చాక సీఎం నేరుగా సంగారెడ్డికి వెళ్లనున్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరుకానున్నారు.




# యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్..
# టాప్10 ర్యాంకర్లు వీరే..

**అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు వచ్చేశాయి.**

**ఈ కబురు,దిల్లీ:** అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ 2024 తుది ఫలితాలు వచ్చేశాయి. ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు.

**ఎంపికైన అభ్యర్థుల జాబితా కోసం క్లిక్ చేయండి**

**టాప్ 10 ర్యాంకర్లు వీరే..**
శక్తి దూబే ప్రథమ ర్యాంకుతో సత్తా చాటగా.. హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్ (4), ఆకాశ్ గార్గ్ (5), కోమల్ పునియా (6), ఆయుషీ బన్సల్ (7), రాజ్‌కృష్ణ ఝా (8), ఆదిత్య విక్రమ్ అగర్వాల్ (9), మయాంక్ త్రిపాఠి (10) ర్యాంకుల్లో మెరిశారు.

**సివిల్‌స్‌లో మెరిసిన తెలుగు తేజాలు వీళ్లే..**
సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివాని 11వ ర్యాంకుతో మెరిశారు. ఆమె వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన రాజు, రజిత దంపతుల ప్రథమ పుత్రిక. తండ్రి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్ పరీక్షలో జోనల్‌వైజ్‌లోనూ 11వ ర్యాంకు సాధించిన సాయి శివాని.. సివిల్స్ ఫలితాల్లోనూ అదే ర్యాంకుతో సత్తా చాటడం విశేషం. అలాగే, సివిల్స్ ఫలితాల్లో బాన్న వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించారు. 2023లో సివిల్స్ ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన వెంకటేశ్ ప్రస్తుతం.. హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ తీసుకుంటున్నారు. మరోవైపు అభిషేక్ శర్మ 38, రావుల జయసింహా రెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతన రెడ్డి 110, చెన్నంరెడ్డి శివ గణేష్‌రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్. శ్రీకాంత్ రెడ్డి 151, నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190, పవన్ కుమార్ రెడ్డి (కర్నూలు) 375, పి.శ్రీకాంత్ (పలమనేరు చిత్తూరు) 904, గోకమల్ల ఆంజనేయులు 934వ ర్యాంకులతో అదరగొట్టారు.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన యూపీఎస్సీ.. ఇందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.

ఈ ఫలితాల్లో 1,009 మందిని ఐఏఎస్, ఎఫ్ఎస్, ఐపీఎస్, సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ ఎ, గ్రూప్ బి సర్వీసులకు ఎంపిక చేయగా.. వీరిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీ నుంచి 87మంది చొప్పున ఉన్నారు.

241 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని ప్రొవిజినల్ జాబితాను రూపొందించి ఉంచిన యూపీఎస్సీ.. ఒకరి ఫలితాన్ని నిలిపివేసినట్లు పేర్కొంది. అలాగే, సివిల్ సర్వీసెస్ నిబంధనలను అనుసరించి సివిల్స్ సాధించిన వారిలో 230 మంది అభ్యర్థులను రిజర్వు జాబితాలో ఉంచినట్లు వెల్లడించింది.

ఈ ఫలితాలకు సంబంధించి ఏదైనా సమాచారం కావాలనుకొనేవారి కోసం యూపీఎస్సీ క్యాంపస్‌లోని పరీక్షా హాల్ వద్ద కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు యూపీఎస్సీ తెలిపింది. 2024 సివిల్స్ పరీక్ష రాసిన అభ్యర్థులు.. తమ పరీక్షలు, నియామకాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా క్లారిటీ కావాలంటే పనిదినాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య స్వయంగా వచ్చి గానీ, 23385271, 23381125, 23098543 ఫోన్ నంబర్ల ద్వారా గానీ సంప్రదించవచ్చని సూచించింది.

సివిల్‌స్‌లో అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు యూపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.



# తెలంగాణలో ఇంటర్ ఫలితాలు..
# బాలికలదే పైచేయి

**ఈ కబురు:** తెలంగాణ ఇంటర్మీడియట్ 2025 ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ ఫలితాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆయా ఫలితాలు వెల్లడించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను విడుదల చేశారు.

రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఒక వారం గడువు ఇస్తున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. నెల రోజుల తర్వాత ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు అంటే మే 22 నుంచి జరగనున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్, ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరిగాయి.

ఈ పరీక్షలకు దాదాపు 9.97 లక్షల (ఫస్ట్, సెకండ్) మంది హాజరయ్యారు. ఫస్ట్ ఇయర్ 66.98 శాతం మంది పాస్ అయినట్టు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు. ఫస్ట్ ఇయర్‌కు దాదాపు 4 లక్షల 88 వేల మంది హాజరయ్యారు. అందులో బాలికలు 73.83 శాతం పాసయ్యారు. బాలురలు 57.83 శాతం పాసయ్యారు.

సెకండ్ ఇయర్ పరీక్షలు 5 లక్షల 5 వేల మంది హాజరయ్యారు. సెకండ్ ఇయర్ 71.37 శాతం పాసైనట్టు వెల్లడించారు. అందులో బాలికలు 74.21 శాతం కాగా, బాలురులు 57.31 శాతం పాసైనట్టు తెలిపారు. వివరాలు తెలుసుకునేందుకు ఈ సైట్‌ని క్లిక్ చేయగలరు. https://tgbie.cgg.gov.in/

ఫస్టియర్‌లో అత్యధికంగా మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లా 48.43 శాతం విద్యార్థులు పాసయ్యారు. సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా ములుగు జిల్లా 80.12 శాతం, అత్యల్పంగా కామారెడ్డి జిల్లా 54.93 శాతంతో విజయం సాధించింది.



## మహీంద్రా ఆటో కొత్త అధ్యక్షుడు
# ఎవరీ వేలుసామి?

మహీంద్రా ఆటో తన కొత్త అధ్యక్షుడిగా ఆర్ వేలుసామిని నియమిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవలప్మెంట్ అధ్యక్షుడిగా ఉన్న వేలుసామి, వీజయ్ నక్రా స్థానంలో తన కొత్త పదవిని చేపడతారు.

1996లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరిన వేలుసామి.. వివిధ స్థాయిలలో కీలక పదవులను చేపట్టారు. ఐసీఈ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఆయన ప్రధాన పాత్ర పోషించారు. మహీంద్రా ఆటో అధ్యక్షుడిగా వేలుసామి.. లాభ, నష్టాలు, డెలివరీతో సహా కంపెనీ ఆటోమోటివ్ కార్యకలాపాలకు పూర్తి బాధ్యత ఉంటుంది.

వ్యవసాయ పరికరాల రంగానికి ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్ సిక్కాను దాని బోర్డు మహీంద్రా లాజిస్టిక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓగా నియమించింది. మునుపటి సీఈఓ రామ్ స్వామినాథన్ పదవీవిరమణ చేసి కొత్త వృత్తిపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నారు.

## ఏఐ ఆధారిత ఉద్యోగాలకు గిరాకీ

**దేశీయ ఉద్యోగ విపణిలో కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాధాన్యం పెరుగుతోందని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడించింది. ఏఐ సంబంధిత ఉద్యోగాలకు తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను ఎంపిక చేసుకునేందుకు ఉద్యోగ సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొంది.**




ముంబయి: దేశీయ ఉద్యోగ విపణిలో కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాధాన్యం పెరుగుతోందని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడించింది. ఏఐ సంబంధిత ఉద్యోగాలకు తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను ఎంపిక చేసుకునేందుకు ఉద్యోగ సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరిజూన్‌లో 74 శాతానికి పైగా కంపెనీలు ఫ్రెషర్స్‌ను నియమించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని 'కెరీర్ అవుట్‌లుక్' నివేదికలో టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 649 యజమాన్య సంస్థలను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించినట్లు వివరించింది.

**పట్టా కాదు.. నైపుణ్యమే కీలకం**
కంపెనీల నిర్వాహకులు డిగ్రీ పట్టాల ఆధారంగా నియామకాలు చేయదలచుకోవడం లేదు. డేటా విజువలైజేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. 'ఫ్రెషర్లు అధిక ప్రభావవంత ఉద్యోగాల్లోకి అడుగుపెట్టడానికి, పరిశ్రమల్లో ఆవిష్కరణలకు కీలక చోదకులుగా మారడానికి ఈ మార్పు అద్భుతంగా ఉపయోగపడుతుంద'ని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ హెడ్ ఆఫ్ ఎంప్లాయిబిలిటీ బిజినెస్ అండ్ సీఓఓ జైదీప్ కేవాల్‌రమణి వెల్లడించారు.

ఇకామర్స్, టెక్నాలజీ అంకురాల నిర్వాహకుల్లో 70% మంది కూడా తాజా ఉత్తీర్ణులను నియమించుకోవాలని యోచిస్తున్నారు. తయారీ రంగంలో 66%, ఇంజినీరింగ్‌మౌలిక సదుపాయాల రంగంలో 62% మంది నిర్వాహకులూ ఫ్రెషర్స్‌ను నియమించుకోవాలని చూస్తున్నారని నివేదిక వెల్లడించింది.

బెంగళూరు, ముంబయి, చెన్నై వంటి నగరాలు కీలక ఉపాధి కేంద్రాలుగా ఉన్నాయి. ఈ నగరాల్లో నియామక అవకాశాలు వరుసగా 78%, 65%, 57 శాతంగా ఉన్నాయి.

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, పర్ఫార్మెన్స్ మార్కెటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ రిస్క్ అనాలిసిస్‌ను అర్థం చేసుకునే ప్రతిభను కంపెనీలు కోరుకుంటున్నాయి.

అవసరమైన టెక్నాలజీ టూల్స్‌లో ప్రొడక్టివిటీ అండ్ కొలాబరేషన్ టూల్స్ (83%), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ (73%), డేటా విజువలైజేషన్ టూల్స్ (64%)కు యజమానులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు



**హైదరాబాద్:** ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులైన ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత శ్రద్ధ పెట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆలోచనలు, ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారితో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన, చిరస్మరణీయమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని.. దాని అమలు బాధ్యత కలెక్టర్లపై ఉందని స్పష్టంచేశారు.

**28 జిల్లాల్లోని పైలట్ మండలాల్లో కార్యశాలలు**
పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో ఈ నెల 30వ తేదీ నాటికి భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు పూర్తవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 159 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. 'సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కూడా పైలట్ మండలాల్లోని రెవెన్యూ సదస్సుల్లో చేర్చాలని అధికారులకు సూచించాం. ఈ మేరకు ప్రస్తుతం 5,905 దరఖాస్తులు వచ్చాయి. వచ్చే నెలలో హైదరాబాద్ సహా 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేస్తాం. ప్రస్తుతం జరుగుతున్న సదస్సుల ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, అనుభవంలోకి వచ్చి అంశాల ఆధారంగా తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు ఆయా మండలాల్లో కార్యశాల(వర్క్‌షాప్)లు నిర్వహించాలి' అని పొంగులేటి మార్గదర్శనం చేశారు.

**నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ**
ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం వారి ఖాతాలలో నేరుగా జమ చేస్తామని మంత్రి తెలిపారు. '400 చ.అడుగులకు తగ్గకుండా, 600 చ.అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే అధికారులు బిల్లులు మంజూరు చేయాలి. వానాకాలం నేపథ్యంలో మే నెల మొదటి వారంలోగా నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలి. 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి, అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలి. అనర్హులకు చోటు కల్పిస్తే ఆ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంటు అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి త్వరలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్, వనపర్తి, మంచిర్యాల, జోగులాంబ గద్వాల తదితర 11 జిల్లాల్లో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఆశించినంత స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) గడువు ఈ నెల 30తో ముగుస్తుందని, మరోమారు గడువు పెంపు ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టంచేశారు.

## దూసుకెళ్తున్న బంగారం ధర..
# లక్ష దాటేసి ఇంకా పైపైకి!

**బంగారం ధర ఇంకా పెరుగుతోంది. దీని ధర తాజాగా లక్ష రూపాయలు దాటేయడంతో పాటు మరో రెండు వేలు పెరిగింది.**

**దిల్లీ:** దేశీయంగా లక్ష రూపాయల మార్క్ దాటి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరిన బంగారం ధర.. మరింత పైకి చేరింది. సోమవారం సాయంత్రం తొలిసారి లక్ష రూపాయలు దాటిన 10 గ్రాముల మేలిమి పసిడి ధర.. తాజాగా మరో రూ.2 వేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రూ.1,02,000కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు బంగారం ధర (31.10 గ్రాములు) 3,467 డాలర్లు పలుకుతోంది.

అటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకు చేరువైంది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ దీని ధర పెరిగింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1,899 పెరిగి రూ.99,178కి చేరింది. ఆపై రూ.98,880కు తగ్గింది. ఆగస్టు కాంట్రాక్ట్ ధర రూ.99,800 వద్ద కొనసాగుతుండగా.. అక్టోబర్ కాంట్రాక్ట్ గోల్డ్ మాత్రం ఏకంగా రూ.2వేలు పెరిగి లక్ష రూపాయల మార్కు దాటేసింది.

**అక్షయ తృతీయపై ప్రభావం?**
సాధారణంగా అక్షయ తృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, బంగారం ధరలు రికార్డుస్థాయిలో ఉండడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. అటు బంగారం వర్తకుల్లోనూ ఇదేతరహా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్షయ తృతీయ రోజు నాటికి (ఏప్రిల్ 30న) బంగారం కాస్త అయినా తగ్గుతుందేమోనని చూస్తున్నారు. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆ మేర అమ్మకాలపై కొంతమేర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



**కారణ మేంటి?**
టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చైనాతో మాత్రం వివాదం కొనసాగిస్తోంది. అయితే, వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్, ట్రంప్ మధ్య వివాదం నెలకొంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, ఆ దేశ రుణాల గురించి మదుపర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు చైనా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో పసిడి ధర పెరుగుతోందని అనలిస్టులు పేర్కొంటున్నారు.

# అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి..!

**భారతీయ మార్కెట్లపై తమ కంపెనీలు పట్టు బిగించేలా అమెరికా ఒత్తిడి పెంచుతోంది.**

దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూదిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చలో ఈకామర్స్ అంశం కూడా వచ్చింది.

భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఈకామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ..''ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకొంటాం'' అని పేర్కొన్నారు.




వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలిసిందే. భారత్‌లో ప్రైస్ ఓపెన్ విధానం అమలుచేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతోపాటు.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు.

భారత్‌లో విదేశీ ఈకామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారుచేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడానికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారు చేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పోలుస్తుంది.

2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఈకామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి.

ఈనేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఈకామర్స్ దిగ్గజాలను అమెరికా చాలా జాగ్రత్తగా సమన్వయం చేసుకొంటోందని ఈ విషయంతో సంబంధం ఉన్నవారు చెప్పినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఈ క్రమంలోనే భారత ఈకామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలు మరింతగా తెరవాలని న్యూదిల్లీపై ఒత్తిడి తీసుకొస్తోంది. ''విదేశీ పెట్టుబడులు దేశంలోకి రావడం స్వాగతించదగిన విషయమే. కానీ, మూల్యంగా భారత రిటైల్ మార్కెట్‌ను ఇష్టానుసారం మార్చేసి.. చిరు వ్యాపారుల ప్రయోజనాలను దెబ్బతీయడం కాదు'' అని కన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు.

2013లో భారత్‌లో అడుగుపెట్టిన నాటినుంచి అమెజాన్ ఇండియా వరుసగా తన పట్టు పెంచుకొంటూ వస్తోంది. కాకపోతే ఫ్లిప్‌కార్ట్ నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. అమెజాన్‌కు 40 మిలియన్‌ల డైలీ యాక్టివ్ యూజర్లు ఉండగా.. ఫ్లిప్‌కార్ట్‌కు 50 మిలియన్ల మంది ఉన్నారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో దూసుకెళ్తున్నాయి. మంగళవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్‌ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్ల లాభాలతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బెంచ్మార్క్ సూచీలు వరుసగా ఆరో ట్రేడింగ్ రోజు కూడా విజయ పరంపరను కొనసాగించాయి.**

బీఎస్ఈ సెన్సెక్స్ 320 పాయింట్ల సానుకూల తేడాతో 79,728 వద్ద రోజును ప్రారంభించింది. కానీ కొంత సేపటికే లాభాలను కోల్పోయి 79,253 వద్ద ఎరుపులోకి జారుకుంది. తర్వాత పుంజుకుని పాజిటివ్ జోన్లో కన్సాలిడేట్ కాగా, ఇంట్రాడే గరిష్ఠ స్థాయి 79,824ను తాకింది. చివరకు సెన్సెక్స్ 187 పాయింట్ల లాభంతో 79,596 వద్ద స్థిరపడింది. ఈ ప్రక్రియలో సెన్సెక్స్ గత ఆరు వరుస ట్రేడింగ్ సెషన్లలో 7.8 శాతం లేదా 5,749 పాయింట్లు పెరిగింది.

**ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ 24,072 వద్ద కనిష్ఠాన్ని తాకి తిరిగి 24,243 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 0.2 శాతం లేదా 42 పాయింట్ల లాభంతో 24,167 వద్ద స్థిరపడింది. మంగళవారం 29వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ ఎన్ఎస్ఈ బెంచ్‌మార్క్ గత ఆరు రోజుల్లో 7.9 శాతం లేదా 1,768 పాయింట్లు పెరిగింది.**




సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎఫ్ఎంసీజీ మేజర్ ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ 2 శాతానికి పైగా లాభపడ్డాయి. అదేసమయంలో మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జొమాటో, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు, మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలో రూ .600 కోట్ల వ్యత్యాసంపై దర్యాప్తు చేయడానికి మరో రౌండ్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడానికి బ్యాంక్ ఈవైని రంగంలోకి దింపడంతో ఇండస్ఇండ్ బ్యాంక్ 5 శాతం నష్టపోయింది.

**పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ 1-2 శాతం మధ్య క్షీణించాయి. విస్తృత మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలను అధిగమించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ రెండూ మంగళవారం 0.8 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈలో 1,500 షేర్లు క్షీణించగా, దాదాపు 2,500 షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీ సూచీల్లో బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ 2.4 శాతం, ఎఫ్ఎంసీజీ 1.9 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.4 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఐటీ, పవర్ సూచీలు భారీగా నష్టపోయాయి.**

# స్టీల్‌పై సేఫ్‌గార్డ్ డ్యూటీ
# 200 రోజుల వరకూ 12 శాతం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వం తాజాగా ఐదు విభాగాల స్టీల్ ప్రొడక్టులపై సేఫ్‌గార్డ్ డ్యూటీకి తెరతీసింది. 200 రోజులపాటు అమలయ్యే విధంగా 12 శాతం సుంకాన్ని విధించింది. ఈ జాబితాలో హాట్ రోల్డ్ క్వాయిల్స్, షీట్లు, ప్లేట్లు తదితరాలున్నాయి. తద్వారా పెరుగుతున్న దిగుమతుల నుంచి దేశీ సంస్థలకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

వాణిజ్య శాఖ దర్యాప్తు విభాగం డీజీటీఆర్ సలహాలమేరకు ప్రభుత్వం స్టీల్ దిగుమతులపై తాజా సుంకాలను విధించింది. వాణిజ్య పరిష్కారాల డైరెక్టర్ జనరల్ సూచనలమేరకు కేంద్ర ప్రభుత్వం 12 శాతం విలువ ఆధారిత ప్రొవిజనల్ సేఫ్‌గార్డ్ డ్యూటీని విధించినట్లు ఆదాయ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా సుంకాలు గడువు కంటే ముందుగా ఎత్తివేయడం లేదా మార్పులు చేపట్టడం వంటివిలేకుంటే 200 రోజులపాటు అమల్లో ఉంటాయని తెలియజేసింది.
సుంకాల పరిధిలో చేర్చిన ఐదు రకాల(విభాగాల) స్టీల్ ప్రొడక్టుల దిగుమతి ధరలు టన్నుకి 675 డాలర్ల నుంచి 964 డాలర్ల మధ్య నిర్ణయించింది. ఈ ధరల కంటే దిగువన దిగుమతయ్యే ప్రొడక్టులకు సేఫ్‌గార్డ్ డ్యూటీ వర్తించనుంది. వీటికంటే అధిక ధరలకు దిగుమతయ్యే(జాబితాలో చేర్చిన) ప్రొడక్టులపై సుంకాలు అమలుకాబోవు.



## తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు

**తెలంగాణలో ఎండల తీవ్రత పెరిగింది. రాగల నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది.**

**ఈ కబురు,హైదరాబాద్:** తెలంగాణలో ఎండల తీవ్రత పెరిగింది. రాగల నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో గరిష్ఠంగా 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వడగాల్పుల తీవ్రత కారణంగా మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావొద్దని సూచించింది. మంగళవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ప్రవస్తి ఆరోపణలపై స్పందించిన గాయని సునీత



**ప్రవస్తి చేసిన ఆరోపణలపై సునీత స్పందించారు. ఆమె ఏమన్నారంటే?**

వర్ధమాన గాయని ప్రవస్తి చేసిన ఆరోపణలకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. వాటిపై ప్రముఖ గాయని సునీత స్పందించారు. ప్రవస్తి వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. అన్ని విషయాలు తనకు ఆపాదించుకుని ఆమె ఫీలవుతోందని పేర్కొన్నారు.

''ప్రవస్తి.. నిన్ను బాల్యంలో నేనూ ముద్దుచేశా. ఈ వయసులో అలా చేస్తే బాగుండదు కదా! ఎవరు బాగా పాడినా మేం లీనమై భావోద్వేగానికి గురవుతుంటాం. ఆయా ఎపిసోడ్స్ నువ్వు చూడలేదనుకుంటా. మా గురించి చర్చించే స్థాయికి వెళ్లినందుకు అసంతృప్తిగా ఉంది. నువ్వు ఎన్నో పోటీల్లో పాల్గొన్నావు కదా..! ప్రాసెస్ ఎలా ఉంటుందో నీకు తెలియదా? మ్యూజిక్ విషయంలో ఛానల్స్‌కు కొన్ని పరిమితులుంటాయి. కాబట్టి అన్ని పాటలూ పాడే అవకాశం ఉండదు. రైట్స్ ఉన్నవి మాత్రమే పోటీలో పాడాలి. ఆడియన్స్‌కు ఇలా అన్ని విషయాలు చెప్పు. అప్పుడు నిజంగా నేను సంతోషిస్తా'' అని అన్నారు.

''ప్రతి విషయానికీ నువ్వు అప్‌సెట్ అయిపోతావు. అమ్మ స్థానంలో నేను అర్థం చేసుకోగలను. వేరే వారిని నేను ఇష్టపడుతున్నా అంటున్నావు. మరి, నువ్వు తప్ప వేరే ఎవరూ నాతో కలిసి ఆల్బమ్‌కు పాడలేదు. ఆ వీడియో కోసం నిన్నే ఎందుకు ఎంపిక చేసుకున్నా? ఇవన్నీ మర్చిపోవడం తప్పు కదా. పెళ్లి వేడుకల్లో నేనూ పాడుతుంటా. ఇప్పుడు ప్రముఖ సంగీత దర్శకుడైన అనిరుధ్.. ఒకప్పుడు వెడ్డింగ్ ఈవెంట్స్‌లో పాడారు. మీ అమ్మగారిని 'నువ్వు' అనడం నిన్ను బాధించిందని, అది సంస్కారం కాదని అన్నావ్. ఎలిమినేషన్ రోజు మీ అమ్మగారు నన్ను ఉద్దేశించి మాట్లాడడం నీకు కరెక్ట్ అనిపించిందా''

''నువ్వు చెప్పినవన్నీ అబద్ధాలే అని రుజువు చేసే అవకాశం లేకపోలేదు. ఓటమిని అంగీకరించలేని బాధలో ఉన్నావు కాబట్టి తర్వాత చర్చించాలనుకుంటున్నా. ఎవరైనా ఓడిపోతే సంతోషించే నీచమైన క్యారెక్టర్ నాది కాదు. నేనూ జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డా. ఓటమిని అంగీకరించలేకపోతే నేర్చుకునేందుకు స్కోప్ ఉండదు. సీనియర్స్‌పై గౌరవం ఉండాలి. సినిమాల్లో మేము పాడిన పాటలను తీసేసిన సందర్భాలూ ఉన్నాయి. అలాగని మేము నీలా బయటకు వచ్చి విమర్శలు చేస్తూ ఇంటర్వ్యూలు ఇవ్వలేదు'' అని ప్రవస్తిని ఉద్దేశించి చెప్పారు.

**జనరేషన్ డేంజర్‌లో..**

''ఈతరం తప్పులు తెలుసుకుని వాటిని సరిదిద్దుకోవడం మానేసి అతిగా స్పందిస్తున్నారు. గెలిస్తే ఒకలా, ఓడిపోతే ఒకలా ప్రవర్తిస్తున్నారు. ఇది జనరేషన్‌ను డేంజర్‌లో పడేసే పరిస్థితి. 'నీకు తెలిసింది తక్కువ. తెలుసుకోవాల్సింది చాలా ఉంది' అని పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు.

# డిజాస్టర్ అని అప్పుడు డిక్లేర్ చేయండి..: రివ్యూలపై నాని

**సినిమా విడుదలైన రోజే రివ్యూలు ఇవ్వాలా? వద్దా? అన్న దానిపై నాని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ఏమన్నారంటే?**

విడుదల రోజే రివ్యూలు ఇవ్వడం వల్ల సినిమాలపై ప్రభావం చూపుతోందని కొన్నాళ్లుగా టాలీవుడ్‌లో చర్చ జరుగుతోన్న సంగతి తెలిసిందే. తన కొత్త చిత్రం 'హిట్ 3' ప్రమోషన్స్‌లో భాగంగా హీరో నాని దానిపై స్పందించారు. ''ఒకప్పుడు అయితే ఓకేగానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరిని ఆపగలం. 'ఫలానా సన్నివేశం, ఫలానా పాట నాకు నచ్చలేదు' అని చెప్పొచ్చు. కానీ, ఈ సినిమా ఆడదు అని డిసైడ్ చేయొద్దని నా విజ్ఞప్తి. వారం, పది రోజులపాటు ఏదైనా సినిమాని ఎవరూ చూడకపోతే అప్పుడు డిజాస్టర్ అని డిక్లేర్ చేసేయండి'' అని పేర్కొన్నారు. నా సినిమా విషయంలో ఎదురవలేదుగానీ.. 'అబ్బో.. తలనొప్పి వచ్చేసింది' అని కొన్ని మూవీస్ విషయంలో కొందరు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు చూశా. వ్యక్తిగతంగా ఓకేగానీ ప్రొఫెషనల్స్ కూడా అలా చేయడం తగదు' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఖలేజా టైటిల్.. అత్యాశకు పోయి రూ.10లక్షలు పోగొట్టుకున్నారు!**

హిట్ 3 గురించి నాని మాట్లాడుతూ.. ''ఈ పోలీస్ కథలో తుపాకుల కంటే ఎక్కువగా కత్తులు వినియోగించడానికీ ఓ కారణం ఉంది. వైలెన్స్ కోసమని ఉద్దేశపూర్వకంగా పెట్టలేదు. దానికో బ్యాక్‌స్టోరీ ఉంటుంది. కన్నడ హీరోయిన్లు టాలీవుడ్‌లో రాణిస్తున్నారన్న ఉద్దేశంతో శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయలేదు. మృదుల పాత్ర రాయడం పూర్తయ్యాక దానికి ఎవరు న్యాయం చేస్తారా? అనే అన్వేషణలో దర్శకుడికి శ్రీనిధి బెస్ట్ ఛాయిస్ అనిపించింది. కొన్ని సినిమాల్లో నేను పోషించిన అర్జున్ పాత్రలకు ప్రేక్షకులు, అభిమానులు బాగా కనెక్ట్ అయ్యారు. ఇందులోనూ అర్జున్ సర్కార్‌గా కనిపిస్తా. అయితే, హీరో పాత్రకు ఫలానా పేరు పెట్టాలని నేను చెప్పను. అది దర్శకుల ఆలోచనే'' అని తెలిపారు. ''నేను నటిస్తున్న 'ది ప్యారడైజ్' వచ్చే ఏడాది మార్చి 26న విడుదలవుతుంది. మార్చి 27న రామ్‌చరణ్ 'పెద్ది' రిలీజ్ కానుంది. రెండూ విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అని అన్నారు.

''కాలేజీ రోజుల్లో నాని సినిమాలు ఎక్కువగా చూసేదాన్ని. ఆయనతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. 'కేజీయఫ్'లో నా పాత్ర ముగిసింది. 'హిట్ 3'లో నా క్యారెక్టర్ చివరి వరకూ ఉంటుందా? 'కేజీయఫ్'లోలాగా ఏదైనా జరుగుతుందా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే'' అని శ్రీనిధి పేర్కొన్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో భాగంగా శైలేష్ కొలను తెరకెక్కించిన 'హిట్ 3' మే 1న విడుదల కానుంది.



# 'నువ్వు' కాదు 'మీరు'.. మీడియాకు విజయశాంతి రిక్వెస్ట్



**ఒకవైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలతో మళ్లీ ఫుల్ బిజీ అయ్యారు విజయశాంతి. ఆమె కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి టాక్‌ని సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా విలేకరులతో ముచ్చటిస్తూ.. మీడియాకు ఓ చిన్న రిక్వెస్ట్ చేసింది. ఇంటర్వ్యూలు చేసే సమయంలో హీరోయిన్లను 'నువ్వు' అని కాకుండా 'మీరు' అని సంభోదించాలని కోరారు.**

'సినిమాలకు దూరంగా ఉన్నా.. నేను అన్ని ఫాలో అవుతుంటాను. సినీ ప్రముఖుల ఇంటర్వ్యూలు చూస్తుంటాను. ఇక్కడ మీకు(మీడియా) ఓ మాట చెబుతాను తప్పుగా తీసుకోకండి. మీరు(మీడియా) ఇంటర్వ్యూలు చేసే సమయంలో హీరోయిన్లను కూడా 'మీరు' అని పిలవండి. చిన్న, పెద్ద తేడా లేకుండా ఏ హీరోయిన్‌ని అయినా మీరు అనే పిలిస్తే వాళ్లను గౌరవించినట్లు ఉంటుంది.

హీరోని మీరంతా అలానే పిలుస్తారు కదా.. మరి హీరోయిన్‌ని నువ్వు అని ఎందుకు అంటారు? చదువుకున్న మనం వాళ్లకు గౌరవం ఇవ్వాలి. ముంబై, చెన్నైతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి హీరోయిన్లు మన టాలీవుడ్‌కి వస్తున్నారు. వారందరిని 'మీరు' అని గౌరవిస్తే.. మన గొప్పదనం తెలుస్తుంది.

నేను కూడా అందరిని మీరు అనే పిలుస్తాను. ఇది నేను ఎన్టీరామారావు దగ్గర నుంచి నేర్చుకున్నాను. సత్యంశివం సినిమా షూటింగ్ సమయంలో నన్ను ఆయన మీరు అనే సంభోదించేవారు. ఆయన మనవరాలి వయసు ఉన్న నన్ను కూడా మీరు అని పిలవడం చూసి ఆశ్చర్యపోయాను. నేను కూడా ఆయనలాగే అందరిని మీరు అని గౌరవించాలకున్నాను.నేను అదే ఫాలో అవుతున్నాను. మీడియా సోదరులు చాలా మంచోళ్లు.. చాలా కష్టపడతారు. హీరోయిన్లను మీరు గౌరవిస్తే.. వాళ్లు కూడా మీతో గౌరవంగా మాట్లాడతారు. నేను చెప్పేది తప్పుగా తీసుకోండి. ఇది నా రిక్వెస్ట్ మాత్రమే'అని విజయశాంతి అన్నారు.




# జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.**

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు.. ఉర్దూ చిత్రాలనూ ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

''తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం'' అని అన్నారు.

జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. హెచ్ఐసీసీ వేదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. జ్యూరీ కమిటీకి ఛైర్మన్‌గా నటి జయసుధ ను ఎంపిక చేశారు. అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు ఇటీవల వెల్లడించారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ప్రస్తుతం జ్యూరీ సభ్యులు పరిశీలిస్తున్నారు.

# ప్రియాంక చోప్రాకు అరుదైన గౌరవం.. ప్రపంచస్థాయి అవార్డ్‌కు ఎంపిక

**బాలీవుడ్ హీరోయిన ప్రియాంక చోప్రా ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 సినిమాలో కనిపించనుంది. రాజమౌళి- మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న తొలి చిత్రంలో ఈ ముద్దుగుమ్మ కీలక పాత్ర పోషించనుంది. ఇటీవలే ఒడిశాలో జరిగిన షూటింగ్ షెడ్యూల్ కూడా పూర్తి చేసుకుంది. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది.**

అయితే తాజాగా ప్రియాంక చోప్రాకు అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రముఖ గోల్డ్ హౌస్ గాలా సంస్థ అందించే గ్లోబల్ వాన్‌గార్డ్ హానర్ అవార్డ్‌కు ఎంపికైంది. ఈ బాలీవుడ్ స్టార్‌తో పాటు హాలీవుడ్ రాపర్ మేగాన్ థీ స్టాలియన్, అకాడమీ అవార్డు దర్శకుడు ఆంగ్ లీ, చిత్రనిర్మాత జాన్ ఎంచు కూడా ఈ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ఈ అవార్డ్‌ను ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన లీడర్లకు అందించనున్నారు. ఈ అవార్డ్‌ను మే 10న లాస్ ఏంజిల్స్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరిగే గోల్డ్ హౌస్ గాలా నాల్గవ వార్షిక సమావేశంలో ప్రియాంక చోప్రాను సత్కరించనున్నారు.

గోల్డ్ హౌస్ గాలా ఏ100 జాబితాను వెల్లడించనుంది. సంస్కృతి, వ్యాపారంలో అత్యంత ప్రభావవంతమైన 100 ఆసియా పసిఫిక్ లీజర్లను ప్రతి ఏటా ఎంపిక చేస్తారు. ఈ సంవత్సరం ఏ100 జాబితా మే 1న వెల్లడించనున్నారు. ఈ వేడుకకు ముందు సినిమా, సాంకేతికత, మీడియాతో సహా వివిధ పరిశ్రమలకు చెందిన 600 మందికి పైగా అతిథులను ఆహ్వానించనున్నారు.

కాగా.. 2000లో మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న ప్రియాంక చోప్రా.. ఆ తర్వాత హిందీ సినిమాలో దాదాపు 25 ఏళ్ల తన కెరీర్‌లో రాణించింది. ఆ తర్వాత ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లోనూ నటించింది. ప్రస్తుతం ఆమె ఆమె జాన్ సెనా, ఇద్రిస్ ఎల్బాతో కలిసి హాలీవుడ్ చిత్రం 'హెడ్స్ ఆఫ్ స్టేట్'లో కూడా కనిపించనుంది.



# 2026 ఆస్కార్ వివరాలు.. ఈసారి ఏఐ చిత్రాలకు కూడా అవార్డు!

**2026లో జరగనున్న ఆస్కార్ వేడుక వివరాలను అకాడమీ పంచుకుంది. వచ్చే ఏడాది మార్చి 15న ఈ వేడుక జరగనున్నట్లు వెల్లడించింది.**




సినీ పరిశ్రమ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక వివరాలు తాజాగా అకాడమీ వెల్లడించింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు తెలిపింది . ఈసారి కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశ

ఆస్కార్ కోసం పోటీ పడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. కొన్ని కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ చేసిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని పేర్కొంది. అలాగే అచీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ కేటగిరీకి రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ ఉండనున్నట్లు వెల్లడించింది. ఫైనల్ ఓటింగ్ ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు కొన్ని రౌండ్ల టెస్టింగ్ ఉంటుందని వెల్లడించింది.

చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ ఉపయోగించి తీసిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. అయితే ఇది ఇతర చిత్రాలపై ప్రభావం చూపదని పేర్కొంది. ఏఐ చిత్రాల కంటే మామూలు వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని అకాడమీ తెలిపింది. మానవ మేధస్సుకే తొలిప్రాధాన్యం ఉంటుందని వెల్లడించింది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు పోటీపడనున్నాయి. అయితే మ్యూజిక్ కేటగిరీలో మాత్రం తుది గడువు 2025 అక్టోబర్ 15గా నిర్ణయించింది.

ఇక అకాడమీ 'స్టంట్ డిజైన్' జాబితాలోనూ అవార్డులు ఇవ్వనున్నట్లు ఇటీవల అధికారికంగా వెల్లడించిన విషయం తెలిసిందే. 2027 నుంచి విడుదల కానున్న చిత్రాలను ఈ జాబితాలో ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు.



# రాణించిన అభిషేక్, రాహుల్.. లఖ్‌నవూ పై దిల్లీ క్యాపిటల్స్ విజయం





**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది.**

లఖ్‌నవూ: ఐపీఎల్ 18 సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ దిశగా దూసుకుపోతోంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ 8 వికెట్ల తేడాతో నెగ్గి ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని దిల్లీ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిషేక్ పోరెల్ (51; 36 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్), కేఎల్ రాహుల్ (57*; 42 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (34*; 20 బంతుల్లో 1 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగారు. కరుణ్ నాయర్ (15; 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశాడు. లఖ్‌నవూ బౌలర్లలో మార్‌క్రమ్ రెండు వికెట్లు తీశాడు.

## దెబ్బతీసిన ముకేశ్ కుమార్..

ఓపెనర్లు ఐడెన్ మార్‌క్రమ్ (52; 33 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (45; 36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో లఖ్‌నవూ సునాయసంగా 200కుపైగా స్కోరు చేసేలా కనిపించింది. 9.5 ఓవర్లకు 87/0తో పటిష్టస్థితిలో లఖ్‌నవూ.. తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి ఊహించిన దానికన్నా తక్కువ స్కోరుకే పరిమితమైంది. నికోలస్ పూరన్ (9), అబ్దుల్ సమద్ (2) విఫలమయ్యారు. డేవిడ్ మిల్లర్ (14) పరుగులు చేశాడు. చివర్లో ఆయుష్ బదోని (36; 21 బంతుల్లో 6 ఫోర్లు) దూకుడుగా ఆడాడు. ముకేశ్ కుమార్ (4/33) లఖ్‌నవూను దెబ్బకొట్టాడు. మిచెల్ స్టార్క్, దుష్మాంత చమీర ఒక్కో వికెట్ పడగొట్టారు.

# అగ్రస్థానంలో హంపి



**మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్లో కోనేరు హంపి టైటిల్ దిశగా సాగుతోంది.**

పుణె: మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్లో కోనేరు హంపి టైటిల్ దిశగా సాగుతోంది. సోమవారం ఏడో రౌండ్లో ఈ భారత గ్రాండ్‌మాస్టర్ 55 ఎత్తుల్లో జు జినెర్ (చైనా)ను ఓడించింది. పొలీనా షవలోవా (రష్యా)తో పోరును ద్రోణవల్లి హారిక 43 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. దివ్య దేశ్‌ముఖ్ 42 ఎత్తుల్లో బత్కు యుగ్ (మంగోలియా)పై విజయం సాధించగా.. అలీనా కలిన్‌స్కయా (రష్యా)తో వైశాలి పాయింట్ పంచుకుంది. మరో రెండు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నమెంట్లో.. హంపి 5.5 పాయింట్లతో ముందంజలో ఉంది. దివ్య దేశ్‌ముఖ్ (5) రెండు, హారిక (3.5) నాలుగో స్థానాల్లో ఉన్నారు. వైశాలి (3) అయిదో స్థానంలో కొనసాగుతోంది

# గెలవాలనే తపన లేదని, 2025 సీజన్‌లో ఇదే బలహీనమైన టీమ్ అని విమర్శించాడు.



**ఐపీఎల్ 18 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శనపై మాజీ ఆటగాడు సురేశ్ రైనా అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టు ఎంపిక సరిగా లేదని, అందుకే సీఎస్కే కష్టకాలం ఎదుర్కొటోందన్నాడు.**

ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్‌లో ఘోరంగా విఫలమవుతోంది. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన చెన్నై.. ఆరు మ్యాచ్‌ల్లో పరాజయంపాలై రెండింట మాత్రమే గెలిచింది. ప్రస్తుతం సీఎస్కే పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. దీంతో చెన్నై ఆటతీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జట్టు ఎంపిక సరిగా లేదని, అందుకే చెన్నై ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని క్రికెట్ విశ్లేషకుల మాట. సీఎస్కే మాజీ ఆటగాడు సురేశ్ రైనా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. సాయి సుదర్శన్, సాయి కిషోర్ వంటి ప్రతిభావంతులైన లోకల్ ఆటగాళ్లను మెగా వేలంలో తీసుకోలేదన్నాడు. ప్రస్తుతం ఉన్న చెన్నై జట్టుకు గెలవాలనే తపన లేదని, 2025 సీజన్‌లో ఇదే బలహీనమైన టీమ్ అని విమర్శించాడు.

'ఈ సీజన్‌లో బలహీనమైన జట్టు సీఎస్కేనే. వారిలో గెలవాలనే తపన లేదు. ఎవరినీ అగౌరవపరచడానికి ఇలా మాట్లాడటం లేదు. కానీ, సీఎస్కే అంటేనే ఒక బ్రాండ్. అది ఇప్పుడు లేదు. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో స్థానిక ఆటగాళ్లు ఎలా ఆడారో చూడండి. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న సాయి సుదర్శన్ అదరగొడుతున్నాడు. సాయి కిశోర్, షారుక్ ఖాన్‌లు కూడా గుజరాత్‌కు ఆడుతున్నారు. మీరు (సీఎస్కే) స్థానిక ఆటగాళ్లను తీసుకురావాలి. మేము టైటిళ్లు గెలిచినప్పుడు సీఎస్కేలో తమిళనాడు ప్లేయర్స్ మురళీ విజయ్, లక్ష్మీపతి బాలాజీ, బద్రీనాథ్, అశ్విన్ ఉన్నారు' అని రైనా పేర్కొన్నాడు.

### పతనానికి ప్రధాన కారణం అదే

పవర్‌ప్లేలో దూకుడుగా ఆడకపోవడమే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పతనానికి ప్రధాన కారణమని రైనా విమర్శించాడు. పవర్ ప్లేలో డాట్ బాల్స్ ఆడకూడదని, స్ట్రైక్‌రోటేషన్ మ్యాచ్‌లను గెలిపిస్తుందన్నాడు. 'మేం చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడినప్పుడు డాట్ బాల్స్ ఆడేవాళ్లం కాదు. స్ట్రైక్‌రోటేషన్ అనేది చాలా ముఖ్యం. మేం మొదటి ఆరు ఓవర్లలో దూకుడుగా ప్రదర్శిస్తే.. డెత్ ఓవర్లలో ధోనీ, ఎల్బీ మోర్కెల్ ఫినిషింగ్ టచ్ ఇచ్చేవారు. ఇలా చేయడం వల్లే చెన్నై విజయవంతమైన జట్టుగా నిలిచింది' అని సురేశ్ రైనా వివరించాడు

# నితీశ్‌కు బీసీసీఐ కాంట్రాక్టు



**బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల జాబితా వచ్చేసింది. అనుకున్నట్లే యువ సంచలనం, తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి బోర్డు కాంట్రాక్టు దక్కించుకున్నాడు.**
**శ్రేయస్, ఇషాన్‌లకు మళ్లీ అవకాశం**
**ఎ+లో రోహిత్, కోహ్లి, జడేజా, బుమ్రా**
**నితీశ్‌కుమార్**

బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల జాబితా వచ్చేసింది. అనుకున్నట్లే యువ సంచలనం, తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి బోర్డు కాంట్రాక్టు దక్కించుకున్నాడు. గత ఏడాది ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చిన నితీశ్.. ఆపై టీమ్‌ఇండియా తరపున టీ20లు, టెస్టుల్లో అదరగొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. నితీశ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మలకు సైతం బీసీసీఐ కాంట్రాక్టులు దక్కాయి. నిరుడు అనూహ్యంగా బీసీసీఐ కాంట్రాక్టులకు దూరమైన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ మళ్లీ అవకాశం అందుకున్నారు.

**దిల్లీ**

భారత క్రికెటర్లకు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. గత ఏడాది లాగే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.. రూ.7 కోట్ల వార్షిక వేతనం చెల్లించే ఎ+ గ్రేడ్‌లో చోటు దక్కించుకున్నారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌తో పాటు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ షమి, రిషబ్ పంత్ 'ఎ' గ్రేడ్‌లో ఉన్నారు. ఈ గ్రేడ్ ఆటగాళ్లకు రూ.5 కోట్ల వార్షిక వేతనం దక్కుతుంది. రోడ్డు ప్రమాదం వల్ల ఏడాదికి పైగా క్రికెట్ ఆడకపోవడంతో నిరుడు 'బి'లో ఉన్న పంత్.. తిరిగి 'ఎ'లో స్థానం సంపాదించాడు. గత ఏడాది 'ఎ'లో ఉన్న రవిచంద్రన్ అశ్విన్ రిటైరవడంతో కాంట్రాక్టు కోల్పోయాడు. టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్న సమయంలో రంజీ ట్రోఫీ ఆడనందుకు నిరుడు బీసీసీఐ కాంట్రాక్టు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ తిరిగి అవకాశం అందుకున్నారు. శ్రేయస్‌కు 'బి' కాంట్రాక్టు దక్కగా.. ఇషాన్ 'సి'లో ఉన్నాడు. రూ.3 కోట్ల వేతనం చెల్లించే 'బి' కాంట్రాక్టులో శ్రేయస్‌తో పాటు భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 'సి'లో కొత్తగా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డితో పాటు వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, అభిషేక్ శర్మ, ఆకాశ్ దీప్ అవకాశం దక్కించుకున్నారు. గత ఏడాది ఐపీఎల్‌లో మెరుపుల తర్వాత నితీశ్ బంగ్లాదేశ్‌పై టీ20లు, ఆస్ట్రేలియాపై టెస్టులు ఆడాడు. ఈ రెండు సిరీస్‌ల్లోనూ అతను రాణించాడు. మరో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ 'సి'లో చోటు నిలబెట్టుకున్నాడు. 3 టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడిన క్రికెటర్లు బీసీసీఐ కాంట్రాక్టుకు అర్హులు. వారికి నేరుగా 'సి'లో అవకాశం దక్కుతుంది. ఈ గ్రేడ్ ఆటగాళ్ల వేతనం రూ.కోటి.

### వారు అక్కడే ఎందుకంటే? రోహిత్, కోహ్లి

సాధారణంగా మూడు ఫార్మాట్లలో ఆడే ఆటగాళ్లకే 'ఎ+'లో అవకాశం దక్కుతుంది. కానీ రోహిత్, కోహ్లి, జడేజా టీ20ల నుంచి రిటైరైనప్పటికీ ఈ గ్రేడ్‌లో ఉండడం ఆశ్చర్యం కలిగించే విషయం. అయితే గ్రేడ్‌ల ఎంపికకు 2023 అక్టోబరు 1 నుంచి సెప్టెంబరు 20 వరకు ప్రదర్శనను పరిగణనలోకి తీసుకున్నారు. గత ఏడాది జూన్‌లో టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులు కావడంతో రోహిత్, కోహ్లి, జడేజాలను 'ఎ+'లోనే కొనసాగించారు.

### ఎవరికి ఏ కాంట్రాక్టు?

ఎ+ (ఏడాదికి రూ.7 కోట్లు): రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా
ఎ (రూ.5 కోట్లు): సిరాజ్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ షమి, రిషబ్ పంత్ బి (రూ.3 కోట్లు): సూర్యకుమార్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్
సి (రూ.కోటి): నితీశ్‌కుమార్ రెడ్డి, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబె, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ముకేశ్ కుమార్, సంజు శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రజత్ పాటీదార్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ఆకాశ్ దీప్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా





# టీమిండియా క్రికెటర్ మంచి మనసు.. రూ.7 లక్షల ఆర్థిక సాయం



టీమిండియా క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తన మంచి మనసును చాటుకున్నాడు. తమిళనాడుకు చెందిన పది మంది యువ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని దూబే చేశాడు. మంగళవారం జరిగిన తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అవార్డ్స్ అండ్ స్కాలర్‌షిప్‌ల ప్రధానోత్సవ కార్యక్రమంలో యంగ్ అథ్లెట్‌స్‌కు దూబే చెక్‌లను అందజేశాడు.

ఈ కార్యక్రమానికి దూబే ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. అదేవిధంగా యువ అథ్లెట్లకు వారి విజయాలకు గుర్తింపుగా తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కూడా రూ. 30,000 స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ఈ సందర్భంగా దూబే మాట్లాడుతూ.. "ఈ కార్యక్రమం యువ అథ్లెట్లందరికీ చాలా ప్రోత్సాహకరంగా ఉందని నేను భావిస్తున్నాను.

ఈ చిన్న విజయాలను గుర్తించి వారిలో కొత్త ఉత్సాహాన్ని తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నింపుతోంది. వారు మరింత కష్టపడి పనిచేసి దేశానికి గర్వకారణంగా నిలుస్తారు ఆశిస్తున్నాను. ఈ అద్భుతమైన కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముంబైలో కూడా ఇటువంటి కార్యాక్రమాలు నేను చూశాను. ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో కూడా యువ క్రీడాకారులకు మద్దతు నిచ్చే ప్రోగ్రామ్స్ నిర్వహిస్తుండడం చాలా సంతోషంగా ఉందని" అన్నాడు.

**నగదు సాయం అందుకున్న తమిళనాడు అథ్లెట్లు వీరే..**
**పిబి అభినంద్ (టేబుల్ టెన్నిస్)**
**కెఎస్ వెనిస శ్రీ (ఆర్చరీ)**
**ముత్తుమీనా వెల్లసామి (పారా అథ్లెటిక్స్)**
**షమీనా రియాజ్ (స్క్వాష్)**
**ఎస్ నంధన (క్రికెట్)**
**కమలి పి (సర్ఫింగ్)**
**ఆర్ అభినయ (అథ్లెటిక్స్)**
**ఆర్‌సి జితిన్ అర్జునన్ (అథ్లెటిక్స్)**
**తక్షంత్ (చెస్)**
**జయంత్ ఆర్కే (క్రికెట్)**

# పాకిస్తాన్ హెడ్ కోచ్‌గా ఆర్సీబీ మాజీ డైరెక్టర్..?



పాకిస్తాన్ పురుషుల క్రికెట్ జట్టు హెడ్ కోచ్ పదవి నుంచి ఆకిబ్ జావేద్ తప్పుకున్న సంగతి తెలిసిందే. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పాక్ ఘోర ప్రదర్శన అనంతరం జావేద్ తన పదవిలో కొనసాగకూడదని నిర్ణయించుకున్నాడు. దీంతో హెడ్ కోచ్ లేకుండానే పాక్ జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది.
అక్కడ కూడా అదే తీరును మెన్ ఇన్ గ్రీన్ కనబరిచింది. పాక్ జట్టు ఈ ఏడాది జూలై ఆఖరిలో వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనుంది. ఈ వ్యవధిలో తమ జట్టు కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేయాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. పాకిస్తాన్ హెడ్ కోచ్ రేసులో న్యూజిలాండ్ మాజీ క్రికెటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్రికెట్ మాజీ డైరెక్టర్ మైక్ హెస్సన్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అతడితో పీసీబీ సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. హెస్సన్ ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ లో ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. అతడి నేతృత్వంలోనే ఇస్లామాబాద్ యునైటెడ్ గతేడాది పీఎస్ఎల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.
అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో కోచ్‌గా అతడికి అపారమైన అనుభవం ఉంది. గతంలో న్యూజిలాండ్ కోచ్‌గా, ఆర్సీబీ క్రికెట్ డైరక్టర్‌గా హెస్సన్ పనిచేశాడు. ఈ క్రమంలోనే అతడిని తమ హెడ్ కోచ్‌గా నియమించాలని పీసీబీ భావిస్తోందంట. అయితే హెడ్ కోచ్ పదవి కోసం ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు సైమన్ కాటిచ్, న్యూజిలాండ్ ప్రస్తుత బ్యాటింగ్ కోచ్ ల్యూక్ రోంచిలతో కూడా పీసీబీ సంప్రదింపులు జరిపినట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి.